ఖాతాకు 3.8 లక్షలు వసూలు!

- 18 అకౌంట్లు తెరవడానికి మొత్తంగా 68 లక్షలు
- మరో రూ.1.5 కోట్లు బహుమతిగా కూడా..
- కర్ణాటక వాల్మీకి స్కామ్‌లో ఏ-3గా తెలంగాణకు చెందిన ఎఫ్ఎఫ్‌సీఎస్ ఛైర్మన్ సత్యనారాయణ

(స్పెషల్ టాస్క్ బ్యూరో)

హైదరాబాద్, అక్టోబర్ 11 (నమస్తే తెలంగాణ): కాంగ్రెస్ పాలిత కర్ణాటకలో వెలుగు చూసిన రూ. 187 కోట్ల విలువైన 'వాల్మీకి' కుంభకోణంలో హైదరాబాద్‌లోని ఫస్ట్ ఫైనాన్స్ కో-ఆపరేటివ్ సొసైటీ ఛైర్మన్ సత్యనారాయణ ఇటకారి కీలక పాత్ర పోషించినట్టు ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్) గురువారం తాజా నివేదికలో వెల్లడించింది. స్కామ్‌కు సంబంధించిన రూ.90 కోట్లను ఏపీ, తెలంగాణకు మళ్లించడంలో ఈయన సాయపడ్డారని తెలిపింది. నగదును డిపాజిట్ చేయడానికి 18 ఖాతాలను తెరిచారని, ఒక్కో ఖాతా తెరవడానికి రూ.3.8 లక్షల చొప్పున మొత్తం రూ.68 లక్షలను ఈయన వసూలు చేసినట్టు సిట్ అధికారులు వెల్లడించారు. దీంతోపాటు మరో రూ.1.5 కోట్లను బహుమతులుగా తీసుకొన్నట్టు పేర్కొన్నారు. ఇందులో 9 నకిలీ ఖాతాల నుంచి రూ.44.6 కోట్లు హైదరాబాద్‌లోని ఆర్బీఎల్ బ్రాంచీకి బదిలీ అయ్యాయి. సత్యనారాయణను ఏ-3గా సిట్ తన రిపోర్ట్‌లో పేర్కొంది.

హైదరాబాద్‌కు నగదు బదిలీ ఇలా..

వాల్మీకి కార్పొరేషన్ నుంచి దారి మళ్లిన మొత్తం రూ.187 కోట్లలో తెలుగు రాష్ట్రాలకు రూ.90 కోట్లు చేరినట్టు సిట్ అంతర్గత నివేదికలో వెల్లడించింది. ఇందులో రూ.44.6 కోట్లు హైదరాబాద్‌కు చెందిన తొమ్మిది కంపెనీల బ్యాంకు ఖాతాల్లో జమైనట్టు వివరించింది. సిట్ నివేదిక ప్రకారం.. వాల్మీకి కార్పొరేషన్ ఎండీ, ప్రస్తుతం సస్పెన్షన్‌లో ఉన్న జేజీ పద్మనాభ్, సస్పెండైన అకౌంట్స్ అధికారి పరశురామ్ బెంగళూరులోని యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఎంజీ రోడ్డు బ్రాంచీలో మార్చి 30, 2024న రూ.50 కోట్లను ఫిక్స్‌డ్ డిపాజిట్ చేశారు. ఈ టర్మ్ డిపాజిట్‌పై అదే రోజు రూ.45 కోట్ల మేర రుణానికి దరఖాస్తు చేశారు. ఇందులో నుంచి అదే రోజు హైదరాబాద్‌లోని ఫస్ట్ ఫైనాన్స్ కో-ఆపరేటివ్ సొసైటీ ఖాతాల్లోకి అటునుంచి ఆర్బీఎల్ బ్రాంచీకి చెందిన 9 బ్యాంకు ఖాతాలకు రూ.44.6 కోట్లను బదిలీ చేశారు. ఈ మేరకు సిట్ నివేదిక వెల్లడించింది. హైదరాబాద్‌కు చేరిన రూ.44.6 కోట్ల నగదుతో లోక్‌సభ ఎన్నికల ముందు పెద్ద యెత్తున మద్యం, ఖరీదైన వాహనాలను కొనుగోలు చేసినట్టు ఈడీ అధికారులు పేర్కొన్నారు.

మహారాష్ట్ర కాంగ్రెస్‌కు రేవంత్ గుబులు

- తెలంగాణతో ఆ రాష్ట్రానికి సుదీర్ఘ సరిహద్దు
- రాష్ట్రంలో ఆరు గ్యారెంటీలు మరిచిన కాంగ్రెస్
- ఇక్కడి మోసంపై సరిహద్దు ప్రజలకు అవగాహన
- ఎన్నికల్లో నష్టం చేస్తుందని 'మహా' కాంగ్రెస్ ఆందోళన

ముంబై, అక్టోబర్ 11: మహారాష్ట్ర కాంగ్రెస్‌కు తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి గుబులు పట్టుకున్నది. తెలంగాణ దుష్పరిపాలనా ప్రభావం తమపై పడుతుందనే ఆందోళన అక్కడి కాంగ్రెస్ నేతల్లో నెలకొన్నది. తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా ప్రజలకు ఇచ్చిన ఏ ఒక్క హామీని అమలు చేయని వైనం తమ మెడకు చుట్టుకుంటుందని వారు కలవరపడుతున్నారు. మహారాష్ట్రలో త్వరలో అసెంబ్లీ ఎన్నికలు జరగనున్నాయి. ఎక్కడ ఎన్నికలు జరిగిన గ్యారెంటీల పేరుతో హామీలు ఇచ్చే పద్ధతిని కాంగ్రెస్ పాటిస్తున్నది. అయితే, మహారాష్ట్రలో గ్యారెంటీల పేరెత్తితే ప్రజలు తమను నిలదీస్తారేమోనని కాంగ్రెస్ నేతలు భయపడుతున్నారు. తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ ముందూవెనుకా ఆలోచించకుండా ఆరు గ్యారెంటీలు, 420 హామీలు ఇచ్చి అమలు చేయలేదు. నిజామాబాద్ నుంచి గడ్చిరౌలి దాకా ఉన్న మహారాష్ట్రలోని అసెంబ్లీ నియోజకవర్గాలతో పాటు శంభాజీనగర్(ఔరంగాబాద్), సోలాపూర్, చంద్రాపూర్, కోల్హాపూర్ ప్రాంతాలు తెలంగాణకు సరిహద్దున ఉన్నాయి. ఏ ఒక్క హామీని అమలు చేయని రేవంత్ సర్కారు వైనంపై మహారాష్ట్ర సరిహద్దు ప్రాంతాల ప్రజలకు మంచి అవగాహన ఉంది.

రేవంత్ మాడల్ 'మహా' కాంగ్రెస్ గుండె గుబేల్

మహారాష్ట్రలో పార్టీలను చీల్చడం పట్ల బీజేపీపై ప్రజల్లో వ్యతిరేకత ఉందనే అభిప్రాయాలు ఉన్నాయి. లోక్‌సభ ఎన్నికల్లో ఇది కనిపించింది. అసెంబ్లీ ఎన్నికల్లోనూ ఈ వ్యతిరేకతను అనుకూలంగా మార్చుకునేందుకు కాంగ్రెస్, శివసేన(ఉద్ధవ్), ఎన్సీపీ(శరద్ పవార్) విశ్వ ప్రయత్నాలు చేస్తున్నాయి. అయితే, ఈ ప్రయత్నాలకు రేవంత్ పాలనా తీరు ఎక్కడ గండికొడుతుందోనని మహారాష్ట్ర కాంగ్రెస్ నేతలు ఆందోళన చెందుతున్నారు. తెలంగాణలో 10 నెలలుగా రేవంత్ సర్కారు ఎన్నికల హామీలు అమలు చేయలేదు. ఈ విషయం బాగా తెలిసిన సరిహద్దు ప్రజలు తాము గ్యారెంటీల పేరుతో హామీలు ఇస్తే నమ్మకపోగా, తిరగబడతారనే ఆందోళన మహారాష్ట్ర కాంగ్రెస్ నేతల్లో కనిపిస్తున్నది. పైగా బీజేపీ కూడా తెలంగాణను ఉదాహరణకు చూపుతూ కాంగ్రెస్ హామీలను నమ్మొద్దని ప్రచారం చేస్తున్నది. హర్యానాలో ఈ ప్రచారం ఫలించింది. రేపు మహారాష్ట్రలోనూ ఇది తమను ముంచేస్తుందేమోనని కాంగ్రెస్ నేతలు కలవరపడుతున్నారు.

కేసీఆర్ పథకాలపై పార్టీల ఆసక్తి

మహారాష్ట్ర ఎన్నికల బరిలో నిలిచిన అన్ని పార్టీలకు ఇప్పుడు కేసీఆర్ మాడల్ ఆకర్షణీయంగా మారిందని ఆ రాష్ట్ర షేత్కారీ సంఘటన్‌లు(రైతు సంఘాలు) చెప్తున్నాయి. కేసీఆర్ హయాంలో 10 ఏండ్లలోనే తెలంగాణ అభివృద్ధి చెందిన తీరును, అమలైన పథకాలను చూసిన సరిహద్దులోని వందలాది గ్రామాల ప్రజలు తమ ప్రాంతాలను తెలంగాణలో కలపాలని తీర్మానాలు చేశారు. మహారాష్ట్ర ప్రజలకు ఇంతలా నచ్చిన కేసీఆర్ మాడల్ పథకాల లాంటివి అమలు చేస్తామని ఎన్నికల్లో హామీ ఇవ్వాలని అజిత్ పవార్ లాంటి నేతలు భావిస్తున్నారు. ఇదే సమయంలో రేవంత్ మాడల్ కాంగ్రెస్ నేతలకే చుక్కలు చూపిస్తున్నది.

సిద్ధరామయ్య బావమరిది విచారణ

బెంగళూరు, అక్టోబర్ 11: కర్ణాటక సీఎం సిద్ధరామయ్య ప్రధాన నిందితుడిగా ఉన్న ముడా భూ కుంభకోణం కేసులో లోకాయుక్త పోలీసులు గురువారం సిద్ధరామయ్య బావమరిది మల్లికార్జున స్వామి, మరో నిందితుడు దేవరాజ్‌లను విచారించింది. కాగా, ఈ కేసులో ఆరోపణలు ఎదుర్కొంటున్న సిద్ధరామయ్య రాజీనామా చేయాలంటూ విపక్షాలు చేస్తున్న డిమాండ్‌ను మంత్రివర్గం ఖండించింది. గురువారం సమావేశమైన మంత్రులు సీఎంకు పూర్తి మద్దతు ప్రకటించారు. తామంతా సిద్ధరామయ్య వెంటే ఉన్నామని మంత్రి హెచ్‌కే పాటిల్ తెలిపారు.

కొవిడ్-19 స్కామ్ నివేదికపై చర్యలకు సిట్

బీజేపీ అధికారంలో ఉండగా కొవిడ్-19 మందులు, పరికరాల కుంభకోణం నివేదికపై తదుపరి చర్యల కోసం కర్ణాటక ప్రభుత్వం ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్)తో పాటు కేబినెట్ ఉప సంఘాన్ని ఏర్పాటు చేసింది. ఈ మేరకు రాష్ట్ర మంత్రివర్గం గురువారం పలు నిర్ణయాలు తీసుకుంది. బీజేపీ అధికారంలో ఉండగా కొవిడ్-19 సంక్షోభం సమయంలో మందులు, ఇతర పరికరాల కొనుగోలులో భారీ అవకతవకలు జరిగాయన్న ఆరోపణలపై జస్టిస్ మైఖేల్ డి కున్హా విచారణ సంఘం దర్యాప్తు జరిపి అందులో అక్రమాలు జరిగినట్టు నిర్ధారించింది.

క్యాబినెట్ మీటింగ్ నుంచి
పవార్ వాకౌట్!

- కూటమిలో విభేదాలంటూ ప్రచారం
- అదేం లేదంటూ ఖండించిన ఎన్సీపీ చీఫ్

ముంబై, అక్టోబర్ 11(నమస్తే తెలంగాణ): మహారాష్ట్ర మంత్రివర్గ సమావేశం నుంచి డిప్యూటీ సీఎం, ఎన్సీపీ అధ్యక్షుడు అజిత్ పవార్ వాకౌట్ చేశారు! గురువారం సమావేశం ప్రారంభమైన 10 నిమిషాలకే అజిత్ పవార్ సమావేశం నుంచి బయటకు వెళ్లిపోయారు. దీంతో మహారాష్ట్రలోని మహాయుతి కూటమిలో విభేదాలు తారస్థాయికి చేరాయని, ప్రభుత్వంలో కీలక భాగస్వామిగా ఉన్న అజిత్ పవార్ శుక్రవారం సాయంత్రం దీనిపై ఒక కీలక ప్రకటన చేస్తారని ప్రచారం జరిగింది. అయితే శుక్రవారం దీనిపై ప్రకటన చేసిన అజిత్ పవార్ ఆ వదంతులకు తెరదించారు. మరఠ్వాడా రీజియన్‌లోని అహ్మద్‌పూర్‌లో ఒక అత్యవసర కార్యక్రమానికి హాజరు కావాల్సి ఉన్నందునే తాను సమావేశం నుంచి బయటకు వచ్చానని ఆయన స్పష్టం చేశారు. తన అనుమతితోనే కేబినెట్‌లో అన్ని నిర్ణయాలు తీసుకున్నారని చెప్పారు.

నటుడు షాయాజీ షిండే ఎన్సీపీలో చేరిక

ప్రముఖ నటుడు షాయాజీ షిండే రాజకీయ రంగ ప్రవేశం చేశారు. శుక్రవారం ఆయన అజిత్ పవార్ నేతృత్వంలోని ఎన్సీపీలో చేరారు. షిండేను త్వరలో జరిగే మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల్లో పార్టీ ప్రచారకర్తగా వినియోగించుకుంటామని పవార్ తెలిపారు. తాను పలు సినిమాలలో రాజకీయ నేతగా నటించానని, ఇప్పుడు రాజకీయ నేత అయ్యాయని, అజిత్ పవార్ శైలి, పనితీరు తనను ఆకర్షించి ఈ పార్టీలో చేరానని షిండే తెలిపారు.

హెజ్బొల్లా మిస్సైల్ కమాండర్ హతం

- మట్టుబెట్టిన ఇజ్రాయెల్ సైన్యం
- బీరుట్‌పై దాడి.. 22 మంది మృతి
- ఐరాస శాంతి దళంపైనా దాడులు

జెరూసలేం: వరుస వైమానిక దాడులతో హెజ్బొల్లా కీలక అధికారులను ఇజ్రాయెల్ సైన్యం మట్టుబెడుతున్నది. శుక్రవారం దక్షిణ లెబనాన్‌పై జరిపిన వైమానిక బాంబు దాడిలో హెజ్బొల్లా మిస్సైల్ యూనిట్ నాయకుడు, సీనియర్ కమాండర్ అరెబ్ ఎల్ షోగా హతమైనట్టు తెలిసింది. ఉత్తర ఇజ్రాయెల్‌పై హెజ్బొల్లా మిస్సైల్ దాడుల వెనుక షోగా ఉన్నట్టు ఐడీఎఫ్ భావిస్తున్నది. మరోవైపు సెంట్రల్ బీరుట్‌పై ఇజ్రాయెల్ చేసిన దాడుల్లో 22 మంది చనిపోయారని, మరో 117 మంది తీవ్రంగా గాయపడ్డారని లెబనాన్ ఆరోగ్య శాఖ తెలిపింది. హెజ్బొల్లా సీనియర్ అధికారి వఫిక్ సఫాను లక్ష్యంగా చేసుకొని ఇజ్రాయెల్ ఈ దాడులు నిర్వహించిందని సమాచారం.

ఇజ్రాయెల్ తీరును ఖండించిన ప్రపంచ దేశాలు

దక్షిణ లెబనాన్‌లోని ఐక్యరాజ్య సమితి శాంతి పరిరక్షణ దళంపైనా ఇజ్రాయెల్ సైన్యం గురువారం దాడులకు దిగింది. నకోరాలోని తమ హెడ్‌క్వార్టర్‌పై ఇజ్రాయెల్ సైన్యం దాడులు చేసిందని, వాహనాలు, సమాచార వ్యవస్థ ధ్వంసమైందని ఐరాస శాంతి పరిరక్షణ దళం 'యుఎన్ఐఎఫ్ఐఎల్' తెలిపింది. ఈ ఘటనలో ఇద్దరు ఐరాస సిబ్బంది తీవ్రంగా గాయపడినట్టు పేర్కొన్నది. దీంతో ఇజ్రాయెల్ తీరును భారత్ సహా అనేక దేశాలు తీవ్రంగా ఖండించాయి. శాంతి పరిరక్షణ దళాల్లో భారత సైన్యం విధులు నిర్వర్తిస్తున్నది.

ఇజ్రాయెల్ ఏజెంట్‌గా మారిన ఇరాన్ టాప్ కమాండర్!

ఇరాన్ ఖుడ్స్ ఫోర్స్ చీఫ్ ఖానీ ఇజ్రాయెల్‌కు ఏజెంట్‌కు మారాడని చెప్తూ అతడితో పాటు మరికొంత మందిని ఇరాన్ దళాలు బంధించాయి. ఇరాన్ దళాలు ఇంటరాగేషన్ చేస్తుండగా, అతడికి గుండెపోటు వచ్చిందని కొన్ని పత్రికలు పేర్కొన్నాయి. ఖానీ ఇటీవల హెజ్బొల్లా చీఫ్, డిప్యూటీ, ఆపరేషన్ చీఫ్‌లతో భేటీ అయ్యాడని... ఆ తర్వాత వారిపై ఇజ్రాయెల్ దాడి చేసినట్టు అల్ హదిత్ ఛానల్ కథనం పేర్కొన్నది.

శబరిమల ఆలయ దర్శన వేళలు పొడిగింపు

మకరవిలక్కులో ఆన్‌లైన్ బుకింగ్‌కు అనుమతి

తిరువనంతపురం, అక్టోబర్ 11: ప్రముఖ పుణ్యక్షేత్రమైన శబరిమల ఆలయ భక్తులకు శుభవార్త. ఇక నుంచి భక్తులు 17 గంటల పాటు అయ్యప్పను దర్శించుకునే అవకాశం కల్పిస్తున్నట్టు ట్రావెన్‌కోర్ దేవస్థానం బోర్డు (టీడీబీ) ప్రకటించింది. రాబోయే మండలం మకరవిలక్కు సీజన్‌ను పురస్కరించుకుని ఉదయం 3 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు, మధ్యాహ్నం 3 నుంచి రాత్రి 11 గంటల వరకు దర్శనానికి అనుమతి ఇస్తామని టీడీబీ అధ్యక్షుడు పీఎస్ ప్రశాంత్ తెలిపారు. స్పాట్ బుకింగ్ కాకుండా ఆన్‌లైన్‌లో బుక్ చేసుకోవాలని స్పష్టం చేశారు.

ప్రాక్టీస్‌లో ఫిరంగి పేలి ఇద్దరు అగ్నివీర్‌ల మృతి

తెలుగు యువకుడికి తీవ్రగాయాలు

ముంబై, అక్టోబర్ 11 (నమస్తే తెలంగాణ): నాసిక్‌లో భారత ఆర్మీ ఆర్టిలరీ సెంటర్‌లో జరిగిన ప్రమాదంలో హైదరాబాద్ ఆర్టిలరీకి చెందిన ఇద్దరు అగ్నివీర్‌లు మృతి చెందగా.. మరొకరు తీవ్రంగా గాయపడ్డారు. గుజరాత్‌లోని రాజ్‌కోట్‌కు చెందిన గోహిల్ విశ్వరాజ్ సింగ్ (20), పశ్చిమబెంగాల్‌కు చెందిన సైకత్, తెలుగువాడైన అప్పలస్వామి (20) హైదరాబాద్ ఆర్టిలరీకి అగ్నివీర్‌లుగా నియామకమయ్యారు. గురువారం ఫిరంగితో కాల్పులు ప్రాక్టీస్ చేస్తుండగా పేలుడు సంభవించింది. ఈ దుర్ఘటనలో తీవ్రంగా గాయపడిన గోహిల్ సింగ్, గున్నర్ సైకత్ షిత్ దేవలాలిలోని మిలటరీ దవాఖానలో చికిత్స పొందుతూ మృతి చెందారు. అప్పలస్వామి తీవ్రంగా గాయపడ్డారు.

గూడ్స్‌ను ఢీకొన్న ఎక్స్‌ప్రెస్ 2 బోగీలు దగ్ధం..

10 మందికి గాయాలు

చెన్నై: చెన్నై సమీపంలోని కవరైపెట్టై వద్ద శుక్రవారం రాత్రి రైలు ప్రమాదం జరిగింది. ఆగి ఉన్న గూడ్స్‌ను మైసూర్ - దర్భంగ ఎక్స్‌ప్రెస్ రైలు ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో ఎక్స్‌ప్రెస్ బోగీలు రెండు దగ్ధమయ్యాయి. మరో రెండు పట్టాలు తప్పాయి. వెంటనే ఎన్డీఆర్ఎఫ్, ఎస్డీఆర్ఎఫ్ బృందాలు సహాయక చర్యలు చేపట్టాయి. ఈ ఘటనలో 10 మంది ప్రయాణికులు గాయపడ్డారు.

జెశోరేశ్వరీకి మోదీ కానుకిచ్చిన కిరీటం చోరీ

ఢాకా: బంగ్లాదేశ్‌లోని ఈశ్వరీపూర్‌లో ఉన్న జెశోరేశ్వరీ కాళీమాత ఆలయానికి భారత ప్రధాని నరేంద్రమోదీ బహూకరించిన కిరీటం చోరీకి గురైంది. మూడేండ్ల క్రితం బంగ్లాదేశ్ పర్యటన సందర్భంగా మోదీ ఈ కిరీటాన్ని బహూకరించారు. గురువారం ఈ కిరీటం అపహరణకు గురైనట్టు తెలుస్తున్నది. దీనిపై బంగ్లాదేశ్‌లోని భారత హైకమిషన్ ఆందోళన వ్యక్తం చేసింది. 'బంగ్లాదేశ్ ప్రభుత్వం వెంటనే దర్యాప్తు జరిపి కిరీటాన్ని స్వాధీనం చేసుకోవాలని కోరుతున్నాం' అని ఢాకాలోని భారత దౌత్య కార్యాలయం 'ఎక్స్'లో ఓ పోస్టు పెట్టింది.

ఢిల్లీ సీఎంకు ఎట్టకేలకు సివిల్ లైన్స్ బంగ్లా

అధికారికంగా కేటాయిస్తూ ఉత్తర్వులు

న్యూఢిల్లీ, అక్టోబర్ 11: ఢిల్లీ ముఖ్యమంత్రి అతిశీకి ఎట్టకేలకు అధికారిక నివాసంగా సివిల్ లైన్స్ బంగ్లాను కేటాయించారు. ఈ మేరకు పీడబ్ల్యూడీ శుక్రవారం ఉత్తర్వులు జారీ చేసింది. ఇంతకు ముందు మాజీ సీఎం అరవింద్ కేజ్రీవాల్ కూడా ఇదే నివాసంలో ఉండేవారు. ఆయన రాజీనామా చేసిన తర్వాత అతిశీ ఈ భవనానికి మారారు. అయితే, లెఫ్టినెంట్ గవర్నర్ ఆదేశాలతో తన సామాన్లను బంగ్లా నుంచి బయటకు విసిరేశారని అతిశీ ఆరోపించారు. దీనిపై ఆప్ - బీజేపీ మధ్య రాజకీయ వివాదం నెలకొన్నది. దీంతో ఎట్టకేలకు ఇదే బంగ్లాను అతిశీకి అధికారికంగా కేటాయించారు. 15 రోజుల్లో ఈ భవనంలోకి మారాలని, ఈ భవనానికి సంబంధించిన కేసుల విచారణకు సహకరించాలని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

ఆరో రోజుకు ఆమరణ దీక్ష

- కోల్‌కతా జూడాల్లో ఒకరి పరిస్థితి విషమం
- ప్రాణహాని జరిగితే దేశవ్యాప్తంగా వైద్య సేవలు బంద్: ఫైమా హెచ్చరిక

కోల్‌కతా, అక్టోబర్ 11: కోల్‌కతాలోని ఆర్జీ కర్ దవాఖాన జూనియర్ డాక్టర్లు(జూడాలు) చేస్తున్న ఆమరణ నిరాహార దీక్ష శుక్రవారానికి ఆరో రోజుకు చేరింది. దీక్ష చేస్తున్న వారిలో ఒకరి ఆరోగ్య పరిస్థితి విషమించడంతో గురువారం రాత్రి ఆర్జీ కర్ దవాఖానలో చేర్చారు. తమ డిమాండ్లను నెరవేర్చే వరకు దీక్ష విరమించేది లేదని దీక్ష చేస్తున్న జూనియర్ వైద్యులు స్పష్టం చేశారు. కాగా, దీక్షలో ఉన్న మరో ఇద్దరి ఆరోగ్య పరిస్థితి కూడా దిగజారింది. ఆర్జీ కర్ దవాఖానలో హత్యాచారానికి గురైన మహిళా డాక్టర్ కుటుంబానికి న్యాయం చేయాలని, హెల్త్ సెక్రటరీ ఎన్ఎస్ నిగమ్‌ను విధుల నుంచి తొలగించాలని జూడాలు డిమాండ్ చేస్తున్నారు. కాగా, జూనియర్ డాక్టర్లు చేస్తున్న డిమాండ్లను వెంటనే పరిష్కరించాలని కోరుతూ వైద్యుల సంఘం పశ్చిమ బెంగాల్ సీఎం మమతా బెనర్జీకి లేఖ రాసింది. జూడాలకు ఏదైనా ప్రాణహాని జరిగితే దేశ వ్యాప్తంగా పూర్తిగా వైద్య సేవలను నిలిపివేస్తామని ఫెడరేషన్ ఆఫ్ ఆల్ ఇండియా మెడికల్ అసోసియేషన్ హెచ్చరించింది.

త్వరలో భారత్‌కు మహదేవ్ యాప్ ప్రమోటర్

దుబాయ్‌లో అరెస్ట్

న్యూఢిల్లీ, అక్టోబర్ 11: 'మహదేవ్' బెట్టింగ్ యాప్ ప్రమోటర్లలో ఒకరైన సౌరభ్ చంద్రకర్‌ను భారత్‌కు రప్పిస్తున్నట్టు ఈడీ అధికార వర్గాలు శుక్రవారం వెల్లడించాయి. మనీ లాండరింగ్, మోసానికి పాల్పడ్డారన్న కేసులో ప్రధాన నిందితులైన చంద్రకర్, మరొక ప్రమోటర్ రవి ఉప్పల్‌పై ఇంటర్‌పోల్ రెడ్ నోటీస్ జారీ చేసింది. దీంతో వారిద్దర్నీ దుబాయ్‌లో పోలీసులు గృహ నిర్బంధంలో ఉంచారు. అనంతరం చంద్రకర్‌ను అరెస్ట్ చేశారు. మరి కొద్ది రోజుల్లో చంద్రకర్‌ను భారత్‌కు తీసుకొచ్చేందుకు ఈడీ అధికారులు సిద్ధమవుతున్నారని తెలిసింది. 2019కు ముందు పండ్ల దుకాణం నడిపిన చంద్రకర్ దుబాయ్ నుంచి బెట్టింగ్ యాప్‌ను నడిపారు.

భారతీయ విద్యార్థులకు
'ట్యాక్స్' గోల

అమెరికాలో గందరగోళంగా పన్ను విధానం

అర్థం చేసుకోకపోతే జరిమానా కట్టాల్సిందే

న్యూయార్క్, అక్టోబర్ 11: అమెరికాలో స్థిరపడాలనుకునే భారతీయ విద్యార్థులకు అక్కడి పన్ను విధానం గందరగోళంగా మారుతున్నది. ముఖ్యంగా ఎఫ్-1 విద్యార్థి వీసా గడువు ముగిసి, హెచ్-1బీ వర్క్ వీసాలకు దరఖాస్తు చేసుకున్న విద్యార్థులు పన్ను విధానంలో ఉన్న సంక్లిష్టత కారణంగా జరిమానాలు కట్టాల్సి వస్తున్నది. సాధారణంగా ఎఫ్-1 విద్యార్థి వీసా గడువు ఐదేండ్లు ఉంటుంది. ఈ ఐదేండ్లలో విద్యార్థులు నాన్ రెసిడెంట్ హోదాలో ఉంటారు. వీరు అమెరికాలో చేసే పార్ట్‌టైమ్ ఉద్యోగం ద్వారా సంపాదించే దానికే పన్ను చెల్లించాలి. భారత్‌లో ఏదైనా ఆదాయం పొందినా పన్ను కట్టాల్సిన అవసరం ఉండదు. అమెరికాలో స్థిరపడిన వారు మాత్రం రెసిడెంట్ హోదాలో ఉంటారు. వీరు అమెరికాలోనే కాకుండా ప్రపంచవ్యాప్తంగా పొందే ఆదాయాన్ని సైతం అమెరికా ప్రభుత్వానికి చూపించి, దానికి వర్తించే పన్నును చెల్లించాల్సి ఉంటుంది. గత మూడేండ్ల కాలంలో 183 రోజులు అమెరికాలో ఉన్న వారికి ఇది వర్తిస్తుంది.

హెచ్-1బి దరఖాస్తుతో సమస్యలు

ఎఫ్-1 వీసా గడువు ముగిసే ముందు భారతీయ విద్యార్థులు అమెరికాలోనే స్థిరపడేందుకు హెచ్-1బి వర్క్ వీసాలకు దరఖాస్తు చేస్తారు. అయితే, ఈ దరఖాస్తు ఆధారంగా ఒక్కోసారి వీరిని రెసిడెంట్‌గా అమెరికా పన్ను అధికారులు పరిగణిస్తున్నారు. హెచ్-1బి లాటరీ పద్ధతిలో కేటాయిస్తారు. ఈ వీసా రాకపోతే కొందరు విద్యార్థులు మళ్లీ ఎఫ్-1 వీసా తీసుకుంటున్నారు. హెచ్-1బి కోసం దరఖాస్తు చేశారు కాబట్టి భారత్‌లో వీరు పొందే ఆదాయాన్ని కూడా అమెరికాలో చూపించి, పన్ను చెల్లించాల్సి వస్తున్నది. చెల్లించకపోతే జరిమానాలు కట్టాల్సి వస్తున్నది.

భారత్‌పై అధిక పన్నులు విధిస్తా

ఎన్నికల ప్రచారంలో ట్రంప్

వాషింగ్టన్, అక్టోబర్ 11: అమెరికా అధ్యక్ష పదవి కోసం మరోమారు పోటీ పడుతున్న రిపబ్లికన్ అభ్యర్థి డొనాల్డ్ ట్రంప్ భారత్‌పై తన అక్కసు వెళ్లగక్కారు. గురువారం డెట్రాయిట్ ఎకనామిక్ క్లబ్‌లో ట్రంప్ ప్రసంగిస్తూ, అమెరికా ఉత్పత్తులపై భారత్ అత్యధికంగా పన్నులు విధిస్తున్నదని, తాను మళ్లీ అధికారంలోకి వస్తే భారత్ నుంచి దిగుమతి అయ్యే వస్తువులపై పన్నులు విధిస్తానని చెప్పారు. అమెరికా దిగుమతులపై చైనా 200 శాతం వరకు సుంకాలు విధిస్తున్నదని, బ్రెజిల్‌లో పన్ను టారిఫ్‌లు కూడా అలాగే ఉన్నాయని ట్రంప్ వ్యాఖ్యలు చేశారు.

ఇంధన, కరెంట్ బిల్లులు తగ్గిస్తా

అధ్యక్షుడిగా గెలిస్తే, విద్యుత్ చార్జీలు సగానికి తగ్గిస్తానంటూ ట్రంప్ హామీ ఇచ్చారు. 12 నెలల్లో ఇంధన, కరెంట్ బిల్లులు సగానికి తగ్గిస్తానని 'ఎక్స్' వేదికగా ప్రకటించారు. దీనిపై స్పందించిన ఢిల్లీ మాజీ సీఎం కేజ్రీవాల్, ఉచిత తాయిలాలు అమెరికా దాకా వెళ్లాయని అన్నారు. ట్రంప్ పోస్టును రీ ట్వీట్ చేశారు.

'నవ భారత్'లో ఆకలి కేకలు

- ప్రపంచ ఆకలి సూచీలో దేశానికి 105వ స్థానం
- 'ఆందోళనకర' విభాగంలో ఇండియాకు చోటు
- పిల్లల్లో తీవ్రమైన పోషకాహార లోపం

న్యూఢిల్లీ, అక్టోబర్ 11: దేశానికి స్వాతంత్య్రం వచ్చి ఎనిమిది దశాబ్దాలు కావొస్తున్నా ఆకలి కేకలు మాత్రం కొనసాగుతూనే ఉన్నాయి. ప్రపంచవ్యాప్తంగా 127 దేశాల్లో చేసిన అధ్యయనం ఆధారంగా వెలువరించిన 19వ ప్రపంచ ఆకలి సూచీ-2024లో భారత్ 105వ స్థానంలో ఉంది. ఐర్లాండ్‌కు చెందిన కంసర్న్ వరల్డ్ వైడ్, జర్మనీకి చెందిన వెల్ట్ హంగర్ లైఫ్ సంస్థలు సంయుక్తంగా ఈ సూచీని విడుదల చేశాయి. ఇందులో ఎక్కువ స్కోర్, ర్యాంకు సాధించిన దేశాలు ఆకలి సంక్షోభంలో తీవ్రంగా ఉన్నట్టు లెక్క. ఆర్థిక సంక్షోభంలో కూరుకుపోయిన శ్రీలంక, అంతర్గత సంక్షోభాలను ఎదుర్కొంటున్న బంగ్లాదేశ్, మయన్మార్‌తో పాటు నేపాల్ లాంటి మన పొరుగు దేశాలు ఈ సూచీలో భారత్ కంటే మెరుగైన స్థానంలో ఉన్నాయి. ఈ సూచీలో భారత్‌ను 29.3 స్కోర్‌తో 'ఆందోళనకర' విభాగంలో చేర్చారు. ప్రపంచవ్యాప్తంగా 36 దేశాలు మాత్రమే 'ఆందోళనకర' విభాగంలో ఉండగా, ఇందులో భారత్ ఒకటి. 2000 సంవత్సరంలో భారత్ స్కోర్ 38.4, 2008లో 35.2, 2016లో 29.3 ఉన్నట్టు ఈ నివేదిక పేర్కొన్నది. గత రెండు దశాబ్దాలుగా పరిస్థితిలో కొంత మెరుగుదల కనిపిస్తున్నప్పటికీ ఇంకా భారత్‌లో ఆకలి కేకలు తగ్గడం లేదని ఈ సూచీలో స్పష్టమైంది.

సంక్షోభ స్థాయిలో పోషకాహార లోపం

భారత్‌లోని పిల్లల్లో పోషకాహారలోపం తీవ్రంగా ఉన్నట్టు ఈ నివేదిక పేర్కొన్నది. చైల్డ్ వేస్టింగ్ రేటు(పిల్లలు ఎత్తుకు తగ్గ బరువు లేకపోవడం)లో 18.7 శాతంతో ప్రపంచంలోనే భారత్ మొదటి స్థానంలో ఉంది. చైల్డ్ స్టంటింగ్ రేట్(పిల్లల్లో వయసుకు తగ్గట్టుగా ఎదుగుదల లేకపోవడం) భారత్‌లో 35.5 శాతం ఉండగా, ఐదేండ్ల లోపు చిన్నారుల మరణాల రేటు 2.9 శాతంగా ఉంది. దేశంలో పోషకాహార లోపం 13.7 శాతం ఉంది. భారత్‌లో 2000వ సంవత్సరం నుంచి పిల్లల మరణాల రేటు తగ్గినప్పటికీ చైల్డ్ వేస్టింగ్ రేట్, స్టంటింగ్ రేట్ సంక్షోభ స్థాయిలోనే ఉందని ఈ నివేదిక పేర్కొన్నది

ఎన్డీయేకు మద్దతు ఉపసంహరించుకోండి

- నితీశ్ కుమార్‌కు ఎస్పీ అధినేత అఖిలేశ్ యాదవ్ పిలుపు
- జేపీకి నివాళులు అర్పించకుండా బీజేపీ తనను అడ్డుకుందని ఆరోపణ

లక్నో, అక్టోబర్ 11: సోషలిస్టు నాయకుడు జయప్రకాశ్ నారాయణ్‌కు నివాళి అర్పించకుండా అడ్డుకున్న బీజేపీ ప్రభుత్వానికి మద్దతు ఉపసంహరించుకోవాలని బీహార్ ముఖ్యమంత్రి, జేడీయూ అధినేత నితీశ్ కుమార్‌కు సమాజ్‌వాదీ పార్టీ అధినేత అఖిలేశ్ యాదవ్ పిలుపునిచ్చారు. శుక్రవారం జయప్రకాశ్ నారాయణ్ జయంతి సందర్భంగా లక్నోలోని జయప్రకాశ్ నారాయణ్ ఇంటర్నేషనల్ సెంటర్(జేపీఎన్ఐసీ)లోని ఆయన విగ్రహానికి నివాళులర్పించాలని సమాజ్‌వాదీ పార్టీ నిర్ణయించింది. దీనికి పోలీసులు అనుమతించలేదు. అఖిలేశ్ ఇంటికి పెద్ద ఎత్తున ఎస్పీ కార్యకర్తలు చేరుకొని బీజేపీకి వ్యతిరేకంగా ఆందోళన చేపట్టారు. చివరకు ఒక వాహనంలో ఏర్పాటు చేసిన జయప్రకాశ్ నారాయణ్ విగ్రహానికి అఖిలేశ్ యాదవ్ నివాళులు అర్పించారు.

జయప్రకాశ్ నారాయణ్ ప్రారంభించిన సోషలిస్టు, ఎమర్జెన్సీ వ్యతిరేక ఉద్యమం నుంచి రాజకీయంగా ఎదిగిన నితీశ్ కుమార్‌ను ఉద్దేశించి అఖిలేశ్ యాదవ్ కీలక వ్యాఖ్యలు చేశారు. 'బీహార్ ముఖ్యమంత్రి ప్రతిసారి జయప్రకాశ్ నారాయణ్ గురించి మాట్లాడుతుంటారు. జేపీ ఉద్యమం నుంచే ఆయన కూడా రాజకీయంగా ఎదిగారు. జయప్రకాశ్ నారాయణ్ జయంతి సందర్భంగా సమాజ్‌వాదీలను నివాళి అర్పించకుండా అడ్డుకున్న ప్రభుత్వానికి నితీశ్ మద్దతు ఉపసంహరించుకోవాలి' అని అఖిలేశ్ పిలుపునిచ్చారు. అఖిలేశ్ వ్యాఖ్యలకు జేడీయూ నేత కేసీ త్యాగి కౌంటర్ ఇచ్చారు. జయప్రకాశ్ నారాయణ్ ఎమర్జెన్సీకి వ్యతిరేకంగా ఉద్యమించారని, ఆ ఎమర్జెన్సీని విధించిన కాంగ్రెస్‌కు అఖిలేశ్ యాదవ్ ముందు మద్దతు ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు.

అణ్వాయుధాలపై పోరాటానికి శాంతి నోబెల్

జపాన్ సంస్థ నిహన్ హిడంక్యోకు ప్రతిష్ఠాత్మక పురస్కారం • అణ్వాయుధ రహిత ప్రపంచం కోసం విశేషంగా పోరాటం

స్టాక్‌హోమ్: ప్రపంచాన్ని అణ్వాయుధ రహితంగా మార్చడానికి విశేషంగా కృషి చేస్తున్న జపాన్ సంస్థకు అత్యంత ప్రతిష్ఠాత్మకమైన నోబెల్ శాంతి బహుమతి లభించింది. హిరోషిమా, నాగసాకి నగరాలలో అమెరికా అణు బాంబు ప్రయోగంతో బాధితులైన వారి తరపున, అణ్వాస్ర్తాలకు వ్యతిరేకంగా పోరాడుతున్న నిహన్ హిడంక్యోకు ఈ ఏడాది నోబెల్ శాంతి బహుమతికి ఎంపికైంది. అణ్వాయుధానికి వ్యతిరేకంగా పోరాటం జరిపేందుకు తీవ్ర ఒత్తిడి ఉన్నప్పటికీ, ప్రపంచాన్ని అణ్వాయుధ రహితంగా మార్చేందుకు దానిపై గళమెత్తడమే కాకుండా, బాధితులకు అండగా నిలిచినందుకు ఆ సంస్థకు ఈ అవార్డు ఇచ్చినట్టు నార్వేజియన్ నోబెల్ కమిటీ ఛైర్మన్ జార్గన్ వాట్నే ఫ్రైడ్‌నెస్ ప్రకటించారు. 'చేదు జ్ఞాపకాలు, శారీరక సమస్యలతో బాధపడుతూ జీవించి ఉన్న అణ్వాయుధ బాధితులందరినీ గౌరవించాలని కోరుకుంటున్నామని, వారి విలువైన అనుభవాలను ఉపయోగించుకునేందుకు శాంతి బహుమతి ఇవ్వాలనుకుంటున్నాం' అని ఆయన పేర్కొన్నారు. హిబకుషా అనే మరో పేరు కూడా ఉన్న నిహన్ హిడంక్యో అణుబాంబు దాడిలో ప్రాణాలతో బయటపడిన వారికి సేవలు అందిస్తున్నది. భవిష్యత్తులో ఇలాంటి కష్టాలు, బాధలు మరే సమాజం అనుభవించరాదని పేర్కొంటూ.. అణ్వాయుధాలను మళ్లీ వాడరాదంటూ బాధితులు, మద్దతుదారులతో పలుసార్లు ప్రదర్శనలు చేయించింది.

నిహన్ హిడంక్యో సంస్థ లోగో

ఆ బాధలు మరెవరూ పడొద్దని..

పసిఫిక్‌లోని అణు దాడి బాధితులు, స్థానిక హిబాకుషా సంస్థలు 1956లో జపాన్ కాన్ఫడరేషన్ ఆఫ్ ఏ అండ్ హెచ్ బాంబ్ సఫర్స్ సంస్థను స్థాపించారు. తర్వాత దీనిని జపనీయులు క్లుప్తంగా నిహన్ హిడంక్యోగా పిలిచేవారు. అనంతర పరిణామాల్లో ఇది జపాన్‌లోనే అతి పెద్ద, ప్రభావవంతమైన హిబకుషా సంస్థగా ఎదిగింది. అణ్వాయుధాల విపత్కర పరిణామాల గురించి ప్రచారం చేయడమే ప్రధాన ధ్యేయంగా సంస్థ పనిచేసేది. అణు దాడి బాధితులు తమ అనుభవాలు, బాధలు, కష్టాల గురించి విద్యాపరమైన ప్రచారం చేయడంతో పాటు వివిధ మార్గాల్లో వాటిని పంచుకునేవారు. అణ్వాయుధాల ప్రభావంతో మనమే కాక, మన తర్వాతి తరాలు ఎదుర్కొనే దుష్పరిణామాలను కళ్లకు కట్టేవారు. అణ్వాయుధాలు అధికార దాహాన్ని తీరుస్తాయే తప్ప అణువంత కూడా మానవాళికి మేలు చేయవని వారు తమ ప్రచారం ద్వారా గట్టిగా వివరించే వారు. ఈ క్రమంలో ఈ సంస్థ వేలకొద్దీ సాక్షుల ఖాతాలను జన బాహుళ్యానికి అందించింది. తీర్మానాలు, ప్రజా విజ్ఞప్తులను జారీ చేసింది.